క్లుప్తంగా

పరీక్ష కేంద్రాల తనిఖీ



ఏపీ మోడల్ స్కూలు పరీక్ష కేంద్రం వద్ద తహసీల్దార్, ఎస్‌ఐ

పాములపాడు: మండల కేంద్రంలోని ఏఎస్‌ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూలు 10వ తరగతి పరీక్షా కేంద్రాలను అధికారులు తనిఖీ చేశారు. బుధవారం హిందీ పరీక్ష జరిగింది. తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంఈఓ-1 సుభాషిణి దేవి, ఎస్‌ఐ సురేష్‌బాబు తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రానికి 100 మీటర్ల దూరం వరకు ఇతరులెవ్వరూ సంచరించకుండా చూసుకోవాలని పోలీసులకు సూచించారు. పరీక్ష రాస్తున్న విద్యార్థులకు ఇబ్బందులేకుండా చూడాలని చీఫ్, డీఓలకు సూచించారు. పరీక్షకు విద్యార్థులు 100శాతం హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్లు సిద్దయ్య, మాధురి తెలిపారు.

హౌసింగ్ లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయం


లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ, అధికారులు

ఆత్మకూరు: బీసీ, ఎస్సీ, ఎస్టీ హౌసింగ్ లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయం అందించనున్నట్లు హౌసింగ్ పీడీ హరిగోపాల్ అన్నారు. బుధవారం చక్రం లేఅవుట్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. డీఈ నాగరాజు, ఏఈ ఉమామహేశ్వరరెడ్డి, , హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లతో పీడీ మాట్లాడారు. గృహ నిర్మాణాలు వేగవంతానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జాతీయ అవార్డులు రావడం గ్రామానికే గర్వకారణం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సర్పంచ్ శ్రీలక్ష్మి, గ్రామస్తులు

మహానంది: మహానంది మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం ఏపీ మోడల్ పాఠశాలకు రెండు జాతీయ స్థాయి అవార్డులు రావడం గ్రామానికే గర్వకారణమని సర్పంచ్ కల్లె శ్రీలక్ష్మి తెలిపారు. ఏపీ మోడల్ స్కూల్‌కు జాతీయస్థాయిలో రెండు అవార్డులు రావడంపై బుధవారం ప్రిన్సిపాల్ లక్ష్మణ్ రావు, ఉపాధ్యాయులు శైలజ, ఆసిఫా భాను, శ్రీకళను గ్రామం తరపున ఆమె ఘనంగా సన్మానించారు. సర్పంచ్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు.

ఒక్కొక్కరికి రూ. 20లక్షలు పరిహారమివ్వాలి

మహానంది: మహానందిలోని నాగనంది వసతి గృహాల సముదాయంలో గదుల కూల్చివేత పనుల్లో ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 20 లక్షలు ఆర్థిక సహాయం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు టి.రామచంద్రుడు, జిల్లా కమిటీ సభ్యులు బాల వెంకట్ కోరారు. బుధవారం పెద్దకొట్టాల గ్రామానికి వెళ్లి మృతి చెందిన వెంకటరాముడు, వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను పరామర్శించి వివరాలు సేకరించారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి


మున్సిపల్ మేనేజర్ రవికుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: వేసవిని దృష్టిలో ఉంచుకుని ఆత్మకూరు పట్టణంలోని ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ డిమాండ్ చేశారు. మున్సిపల్ మేనేజర్ రవికుమార్‌ను కలిసి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం కావడంతో ఎండలు విపరీతంగా ఉన్నాయన్నారు. ఆత్మకూరు పట్టణానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి వివిధ పను మీద ప్రజలు వస్తుంటారన్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు పాదయాత్రగా శ్రీశైలానికి వెళ్తుంటారన్నారు. వీరిని దృష్టిలో ఉంచుకుని ప్రధా న కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రధానంగా ఆత్మకూరు పట్టణంలోని అయ్యప్పస్వామి గుడి వద్ద, కొత్త బస్టాండు వద్ద, సంగమేశ్వర సర్కిల్ వద్ద, నంద్యాల టరి్నంగ్ వద్ద చలివేంద్రాలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వీరన్న, ఎ.సురేంద్ర, షేక్ ఇస్మాయిల్, నాయకులు ఎ.కిరణ్, పాల శివుడు, నూర్‌అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి కల్యాణం


స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితుడు

మహానంది: మహానందీశ్వరుడి దంపతుల కల్యాణ మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఈఓ. నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, అర్చకుడు జనార్దనశర్మ స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

భక్తుల సందడి


కోనేరులో భక్తుల పుణ్యస్నానాలు

మహానంది: ఉగాది సమీపిస్తున్న నేపథ్యంలో మహానందిలో కర్ణాటక భక్తుల సందడి ప్రారంభమైంది. బుధవారం వేలాది మంది కన్నడిగులు ఆలయానికి చేరుకుని శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. దర్శనానికి ముందు కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించారు.

సాక్షి గణపతికి విశేషపూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోక కల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయప్రాంగణంలోని జ్వాలావీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షిగణపతి స్వామికి పంచామృతాలు, ఫలోదకాలతో అభిషేకం చేసి విశేష పుష్పార్చన, నివేదన కార్యక్రమాలు చేపట్టారు. అలాగే జ్వాలావీరభద్రస్వామివారికి అభిషేకం, విశేష పుష్పార్చన జరిపించారు.

కాంట్రాక్టర్లకు ఇస్తే పర్యవేక్షించరా?

- మహానంది దేవస్థానం అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బందిపై జేసీ ఆగ్రహం
- ఇద్దరు కార్మికుల మృతిపై ఆవేదన
- బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ


కూల్చిన వసతిగృహాల వద్ద పరిశీలిస్తున్న దేవదాయశాఖ జేసీ ఆజాద్

మహానంది: మహానందిలో నాగనంది సముదాయం వసతిగృహాలు కూల్చేసే పనులను కాంట్రాక్టర్‌కు ఇస్తే దేవస్థానం అధికారులు, ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది పర్యవేక్షించాల్సిన బాధ్యత లేదా అంటూ దేవదాయశాఖ జేసీ చంద్రశేఖర ఆజాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహానందిలో స్లాబ్ పెచ్చులు పడి ఇద్దరు కార్మికులు మృతి చెందిన నేపథ్యంలో బుధవారం ఆయన మహానందికి చేరుకుని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం దేవస్థానం కార్యాలయంలో ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ ఎరమల మధు, ఏఈ శ్రీనివాసులు, సిబ్బందిని అడిగి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో జరిగే పనులను ఎవరు చేస్తున్నా అధికారులు పర్యవేక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఏఈ, ఇంజినీరింగ్ సిబ్బంది ఉండేదెందుకని ప్రశ్నించారు. నాగనంది వసతి సముదాయం ఎప్పుడు నిర్మించారు?, ఎన్నేళ్లయింది తదితర వివరాలు జేసీ అడగగా మహానంది దేవస్థానం అధికారులు చెప్పలేక అటూ ఇటూ తిరిగారు. చివరికి వసతి గృహాల వద్దకెళ్లి శిలాఫలకాలను చూసి చెప్పడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు.

కార్మికుల మృతి బాధాకరం

నాగనంది సముదాయం వసతి గృహాలు కూల్చే సమయంలో ఇద్దరు కార్మికులు మృతి చెందడం బాధాకరమని, వారిని ఆదుకుంటామని జేసీ చంద్రశేఖర ఆజాద్ అన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలకు దేవస్థానం తరపున రూ.లక్ష, కాంట్రాక్టర్ తరపున రూ.లక్ష చొప్పున ఒక్కొక్కరికి రూ.రెండు లక్షలు పరిహారం అందిస్తామన్నారు. ప్రమాద ఘటనపై కమిషనర్ రామచంద్రమోహన్‌కు రిపోర్టు చేస్తామన్నారు. ప్రభుత్వం, కమిషనర్‌తో చర్చించి తదుపరి చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

శ్మశాన వాటిక కబ్జాను అడ్డుకోవాలి


శ్మశాన వాటిక వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మాలల శ్మశాన వాటికను కబ్జాదారుల నుంచి కాపాడాలని మాల మహానాడు జాతీయ కార్యదర్శి సాగరాజు మునెయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండలంలోని ముసలిమడుగు గ్రామ శివారులోని శ్మశాన వాటిక వద్ద మాలలతో కలసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో సర్వేనంబర్ 679/ఐ/1 లో ఉన్న ఐదెకరాల శ్మశాన భూమిని దశాబ్దాల కాలం నుంచి మాల వర్గీయులు అనుభవిస్తున్నారన్నారు. ఇందులో రెండెకరాల భూమిని గ్రామానికి చెందిన తెలుగు పెద్ద కురుమన్న, చిన్న కురుమన్న అక్రమంగా ఆన్‌లైన్ చేసుకొనేందుకు చూస్తున్నారని, వారికి ఒత్తాసు పలుకుతూ రెవెన్యూ సిబ్బంది మాల సామాజిక వర్గానికి నోటీసులు పంపడం బాధాకరమన్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జాతీయ మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు నలమల అబ్రహం, సమతా సైనిక్ దళ్ జిల్లా ఉపాధ్యక్షుడు సగినేల సురేష్ జగదీష్, సుబ్బన్న, రవికుమార్,మల్లికార్జున, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రశాంతంగా జీవించాలి


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ రామాంజినాయక్

కొత్తపల్లి: గ్రామాల్లోని ప్రజలు కులమత భేదం లేకుండా అన్నదమ్ములవలే ప్రశాంతంగా జీవించాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామంలో నేరాలు, మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో అల్లర్లు, గొడవలు, ఘర్షణలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాలలో మద్యం, నాటుసారా అమ్మితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. మహిళలపై జరిగే నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. మహిళలకోసం ప్రత్యేక శక్తి యాప్ రూపొందించినట్లు చెప్పారు. సైబర్ క్రైమ్, ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీ నంబర్ అడిగితే ఇవ్వరాదని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసులను సంప్రదించాలన్నారు. ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్ రెడ్డి, ఎస్‌ఐ ఎం.కేశవ, గ్రామప్రజలు ఉన్నారు.

ఉచిత న్యాయసేవలపై అవగాహన


మాట్లాడుతున్న కర్నూలు జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

నందికొట్కూరు: లాయర్‌ను పెట్టుకోవడానికి స్థోమత లేని వారికి ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని కర్నూలు జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి అన్నారు. ఆయన బుధవారం పట్టణంలోని సబ్‌జైల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముద్దాయిలతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉచిత న్యాయ సేవలపై అవగాహన కల్పించారు. ముద్దాయిలు ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలన్నారు. సౌకర్యాలు, భోజనం గురించి ఆరా తీశారు. అనంతరం డాక్టర్ ప్రవీణ్ ఖైదీలకు వైద్య పరీక్షలు చేశారు. జూనియర్ సివిల్ జడ్జి దివ్య, సబ్ జైల్ సూపరింటెండెంట్ మహమ్మద్ రఫీ, న్యాయవాది అరుణ్‌కుమార్, స్థానిక మండల లీగల్ సర్వీస్ అథారిటీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

కేజీబీవీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పగిడ్యాల: స్థానిక కేజీబీవీ బాలికల పాఠశాలలో 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం, 7, 8, 9, 10వ తరగతిలో మిగిలిన సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి సుభాన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనాథలు, బడి బయటి పిల్లలు, బడి మానేసిన (డ్రాపౌట్స్), పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బాలికలు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులనే పరిగణలోకి తీసుకుంటారని ఎంఈఓ స్పష్టం చేశారు. ఈ నెల 22వ తేదీ నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు సమయం ఉందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పాములపాడు: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయలో 6వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు, అలాగే 7, 8, 9, ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం మిగిలిన సీట్లకు అర్హులైన బాలికలు దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేకాధికారి రాజ్యలక్ష్మి తెలిపారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బాలికలు httpr://apkgbv.apcfss.in/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అదనపు లోడు క్రమబద్ధీకరించుకోవాలి

నందికొట్కూరు: విద్యుత్ ఉపకరణాలు వాడే వినియోగదారులు అదనపు లోడును క్రమబద్ధీకరించుకోవాలని విద్యుత్ శాఖ డివిజన్ అధికారి శ్రీనివాసులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నందికొట్కూరు మున్సిపాలిటీ, మండలం, పగిడ్యాల, మిడుతూరు, జూపాడుబంగ్లా మండలాల విద్యుత్ వినియోగదారులు విద్యుత్ ఉపకరణాలు ఎక్కువగా వినియోగిస్తున్నట్లయితే అదనపు లోడు క్రమబద్ధీకరించుకునేందుకు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ 50 శాతం రాయితీ ఇస్తుందని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

టీకా కార్యక్రమాన్ని పూర్తి చేయాలి


టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ రామాంజనేయనాయక్

పగిడ్యాల: జాతీయ పశు వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన బ్రుసెల్లోసిస్, గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని ఈనెల 30 నాటికి పూర్తి చేయాలని జూపాడుబంగ్లా డివిజన్ పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు రామాంజనేయనాయక్ ఆదేశించారు. ఆయన బుధవారం మండలంలోని సంకిరేణిపల్లె గ్రామంలో జరిగే వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. 4 నుంచి 8 నెలల వయస్సు కలిగిన పెయ్య దూడలకు బ్రుసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు వేయించాలని రైతులకు సూచించారు. పెయ్యి దూడల సంతానం కోసం రైతులు ఒక పశువుకు రూ.500 చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. పశు బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పశుగ్రాసం పెంపకాలు చేపట్టేందుకు అవకాశం కల్పించిందని వివరించారు. పశువైద్యు లు డాక్టర్ శ్రుతికీర్తి, తదితర సిబ్బంది ఉన్నారు.

టెండర్‌లో ఒకరు...పనుల్లో మరొకరు !


ప్రమాదానికి కారణమైన నాగనంది సముదాయం

మహానంది: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందిలోని నాగనంది వసతి గృహాల సముదాయం వద్ద పాత గదులను తొలగించే పనుల్లో సైతం టెండర్లలో ఒకరు, పనులు చేసేది మరొకరని వెలుగులోకి వచ్చింది. పాతగదులను తొలగించేందుకు దేవస్థానం వారు పిలిచిన టెండర్లలో నారాయణరెడ్డి అనే కాంట్రాక్టర్ 6.9 శాతం లెస్‌తో రూ. 3,85,573కు పనులను దక్కించుకున్నాడు. అయితే అయన వద్ద జేసీబీలు, మిషన్లు లేకపోవడంతో గదుల తొలగింపు బాధ్యతను ఇతరులకు ఇచ్చినట్లు ఉన్నతాధికారుల దృష్టికి వచ్చింది. ఆలయ అధికారులు, కాంట్రాక్టర్ల పర్యవేక్షణ లేకపోవడంతోనే రెండు నిండు ప్రాణాలు కూలిపోయాయని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా కూల్చివేత చివరి అనుమతుల్లో సైతం స్థానిక అధికారి సంతకాలు లేకపోవడంతో రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ చంద్రశేఖర ఆజాద్ ఆగ్రహించినట్లు సమాచారం. దీంతో అప్పటికప్పుడు కాగితాలపై సంతకాలు చేయించినట్లు తెలిసింది.

జేసీబీ ఆపరేటర్‌పై కేసు నమోదు..

మహానందిలో జరిగిన ఇద్దరు మృతి చెందిన సంఘటనపై బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జేసీబీ ఆపరేటర్‌పై కేసు నమోదు చేసినట్లు బుధవారం రాత్రి ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మృతి చెందిన పెద్దకొట్టాలకు చెందిన గుత్తి వెంకటరాముడు భార్య తులశమ్మ ఫిర్యాదు మేరకు జేసీబీ ఆపరేటర్ రమణరావుపై కేసు నమోదు చేశారు. అజాగ్రత్తగా, చూసుకోకుండా జేసీబీని ఆపరేట్ చేయడంతో ఇద్దరు మృతి చెందారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

పీ-4 సర్వేపై గ్రామ సభలు

పాములపాడు: ఈ నెల 21, 22 తేదీల్లో పీ-4 సర్వేపై గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. జీఎస్‌డబ్ల్యూఎస్ శాఖకు చెందిన పీ - 4 సర్వేకు సంబంధించి 20 శాతం కన్నా దిగువన ఉన్న కుటుంబాలను గుర్తించి గ్రామ సభలో తీర్మానం చేయడం జరుగుతుందన్నారు. ఈ గ్రామ సభలకు మండలంలోని అన్ని గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు అందరూ హాజరుకావాలని వివరించారు. ఈ నెల 21న చెలిమిల్ల, లింగాల, యర్రగూడూరు, జూటూరు-1, జూటూరు-2 (తుమ్మలూ రు), మద్దూరు, పాములపాడు-1, పాములపాడు-2 (రుద్రవరం) మిట్టకందాల, వానాల, 22వ తేదీన భానుముక్కల, బానకచెర్ల, ఇస్కాల, వేంపెంట గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రెండో రోజు పరీక్షలు ప్రశాంతం

కొత్తపల్లి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా రెండవ రోజు బుధవారం జరిగిన హిందీ పరీక్ష ప్రశాంతంగా జరిగాయి. కొత్తపల్లి, గోకవరం కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. కొత్తపల్లి సెంటర్‌లో 171 మందికిగాను 168 మంది హాజరు కాగా 3 గైర్హాజరయ్యారని పరీక్ష నిర్వహణాధికారి వెంకటరమణ ఆచారి తెలిపారు. అదేవిధంగా గోకవరం పరీక్ష కేంద్రంలో 86 మంది గాను 79 మంది విద్యార్థులు హాజరయ్యారని, ఏడుగురు గైర్హాజరయ్యారని పరీక్షల నిర్వహణాధికారి వెంకటశివుడు వెల్లడించారు. కొత్తపల్లి పరీక్ష కేంద్రాన్ని జోన్ డిప్యూటీ డీఈఓ వెంకటరామిరెడ్డి తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు.

మున్సిపల్ స్థలాల కబ్జాపై చర్యలేవీ?

నందికొట్కూరు: మున్సిపాలిటీ నడిబొడ్డున కబేళా వెనుక ఉన్న మున్సిపల్ స్థలాన్ని అక్రమార్కులు కబ్జా చేస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఫక్కీర్ సాహెబ్, ఆరోపించారు. బుధవారం ఆ స్థలంలో చేపట్టిన నిర్మాణాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. లక్షల విలువైన స్థలం కబ్జా చేసి నిర్మాణం చేపడుతుంటే మున్సిపల్ అధికారులు కళ్లులేని కబోదిలా వ్యవహరించడం తగదన్నారు. అధికార పార్టీ నాయకుల కబ్జాపై ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదని మండిపడ్డారు. కబ్జాలను అడ్డుకోకుంటే ప్రజలను సమీకరించి మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఆ సంఘం నాయకులు ఇంతియాజ్, గోకారి, అబ్దుల్లా, మహబూబ్, వహిదా, బీబీ, సాలెహన్, తదితరులు ఉన్నారు.

ఓంకారం రోడ్డుకు మరమ్మతులు చేయాలి


మణికంఠపురం గ్రామంలో ప్రజా చైతన్య యాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

బండి ఆత్మకూరు: ఓంకార క్షేత్రానికి వెళ్లే రహదారిని బాగు చేయాలని సీపీఎం నాయకులు రత్నమయ్య, సుబ్బరాయుడు, శరభా రెడ్డి, శ్రీనివాస రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా బుధవారం మండల పరిధిలోని మణికంఠపురం గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రముఖ పుణ్య క్షేత్రమైన ఓంకారానికి వెళ్లే రహదారి తెలుగు గంగ కాలువ వల్ల కోతకు గురైందని, రోడ్డు మొత్తం గుంతలమయమేనని , అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేయాలని కోరారు. అలాగే పేదలకు పక్కా ఇళ్లు నిర్మించాలని, ఉపాధి పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

పొలంబడి కార్యక్రమం


రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

నందికొట్కూరు: మండల పరిధిలోని కోళ్లబావాపురం గ్రామంలో రైతులకు పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రబీలో సాగుచేసిన శనగ, మినుము పైర్లను అధికారులు పరిశీలించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ రామకృష్ణారావు, డాక్టర్ నీలిమ్, డాక్టర్ చైతన్య, ఏడీఏ జయశేఖర్ మాట్లాడుతూ.. శనగ పంటలో లద్దె పురుగు, కాయ తొలిచే పురుగు నివారణ చర్యలను వివరించారు. పొలంబడి ద్వారా ఏ భూములకు ఏ పంటలు సరిపోతాయి, ఆ పంటలకు తెగుళ్లు సోకకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలను తెలుసుకోవచ్చన్నారు. రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలన్నారు. పంట మార్పిడి, అధిక ఉత్పత్తి వంగడాల సాగుతో లాభాలను అర్జించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో ఏడీఏ విజయశేఖర్ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. శనగ, మినుము, వేరుశనగ పంటల్లో సస్యరక్షణ పద్ధతులను వివరించారు. రైతులు సబ్సిడీ వ్యవసాయ పనిముట్ల కోసం రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఏఓ షేక్షావలి, తదితరులు ఉన్నారు.

ఉద్యోగుల ఔదార్యం


సునీతకు చెక్కు అందజేస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు తమ సహచర ఉద్యోగులు కుటుంబాలకు సాయం అందించి ఔదార్యం చాటుకున్నారు. శ్రీశైల దేవస్థానం ప్రచురణ విభాగంలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై ఫోటోగ్రాఫర్‌గా విధులు నిర్వహిస్తున్న కె.జయచంద్రుడు అనారోగ్య కారణాలలో ఇటీవల మరణించాడు. మృతిచెందిన జయచంద్ర భార్య సునీతకు దేవస్థాన ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ నెలవారి జీతం నుంచి ఒకరోజు వేతనం రూ.2,67,709 చెక్కును, అలాగే ఆలయ విభాగం (ఇష్టకామేశ్వరి ఆలయం) నందు ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై పనిచేస్తున్న ఉద్యోగి చిగుర్ల ఈదన్న అనారోగ్య కారణాలతో ఇటీవల మరణించాడు. మృతిని భార్య సి.హెచ్.వెంకటమ్మకు రూ.2,70,055 చెక్కును బుధవారం శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీశైల దేవస్థాన కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బాలాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముష్టపల్లిలో ఉచిత కంటి వైద్యశిబిరం


కంటి సమస్యలున్న వారిని పరీక్షిస్తున్న వైద్యాధికారిణి

ఆత్మకూరు: జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని బైర్లూటి పీహెచ్‌సీ పరిధిలో ఉన్న ముష్టపల్లి గ్రామంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి కంటి వైద్య నిపుణులు డాక్టర్ జాహ్నవి బృందం దాదాపు 40 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏడుగురికి శుక్లాలు ఉన్నట్లు గుర్తించి ఆపరేషన్ నిమిత్తమై వారిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి పవన్‌కుమార్, కంటి వైద్య నిపుణులు షేక్షావలి, సీహెచ్‌ఓ అహ్మద్‌బాషా, ఆరోగ్య కార్యకర్త ఇందిరా ప్రభావతి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

భూసారం ఆధారంగా ఎరువులు వాడాలి

పాములపాడు: భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా పొలాల్లో ఎరువులు వాడాలని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని మద్దూరు, మిట్టకందాల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలంలో భూమికి రక్షణ ఇచ్చే పైర్లను సాగు చేసుకోవడం, భూమిని కలియ దున్నడం వల్ల భూసారాన్ని రక్షించుకోవచ్చన్నారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, పెట్టుబడుల గురించి తెలియజేశారు. ప్రతి రైతు ఫార్మర్ రిజిష్టర్ చేయించుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్లకు దరఖాస్తు చేసుకోండి

జూపాడుబంగ్లా: ఉచిత కుట్టుమిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ.. మహిళలకు ఉచితంగా మిషన్ కుట్టుపై శిక్షణ ఇవ్వడంతో పాటు శిక్షణ పూర్తిచేసుకొన్న వారికి ఉచితంగా కుట్టుమిషన్ అందజేయనున్నట్లు తెలిపారు. 20 – 40 వయసున్న బీసీ, ఈడబ్ల్యూఎస్ కులాల మహిళలు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు ఆధార్, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, రేషన్‌కార్డు, ఫొటోతో గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.